సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 18 । మార్చి । 2025



'రాయలసీమ' పథకాన్ని పూర్తి చేయాలి

రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ॥ (సా॥)	సహర్ బుధ॥ (ఉ॥)
కడప	6.31	5.05
పులివెందుల	6.33	5.12
ప్రొద్దుటూరు	6.32	5.09

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.5 /21.4

జిల్లాలో సోమవారం 21.4 - 39.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదైంది. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

బీఈడీ పరీక్షలు షురూ



పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని 15 కేంద్రాల్లో బీఈడీ, ఎంఈడీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. బీఈడీ పరీక్షలకు 4,463 మంది విద్యార్థులు, ఎంఈడీ పరీక్షలకు 63 మంది విద్యార్థులు హాజరయ్యారు. కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో, విజయలక్ష్మి బీఈడీ కళాశాల పరీక్షా కేంద్రాలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు, అబ్జర్వర్లు ఆచార్య మాధవి, ఆచార్య రియాజ్ ఉన్నిసా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేలా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు మాట్లాడుతూ పరీక్షలు ఈనెల 22వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు.

గండి దేవస్థాన భూములకు వేలం పాట



వేలం పాటలో మాట్లాడుతున్న ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య

చక్రాయపేట : మండలంలోని మారెళ్ల మడక గ్రామ పంచాయతీలో ఉన్న గండి వీరాంజనేయస్వామి ఆలయంలో సోమవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో గండి దేవస్థాన భూములకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో ఇడుపులపాయ గ్రామ సర్వే నెంబర్ 469లో గల 8.72 ఎకరాల భూమిని ఏడాది కాలానికి రూ.1.51 లక్షలకు పి.జి.మహేష్ దక్కించుకున్నారు. అలాగే వీరన్నగట్టుపల్లె గ్రామంలోని 98 సెంట్ల భూమిని రూ.4 వేలకు ఆర్.తేజేశ్వర దక్కించుకున్నారు. అలాగే గండి దేవస్థానానికి సంబంధించిన సులభ్ కాంప్లెక్స్‌ను రూ.20 వేలకు ఇడుపులపాయకు చెందిన పి.వెంకటరత్నం దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కృష్ణతేజ, మాజీ చైర్మన్ వెంకటస్వామి, దేవస్థాన ఉప ప్రధాన అర్చకుడు రాజా రమేష్, ఆలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూ ఉపకులపతిగా ఆచార్య అల్లం శ్రీనివాసరావు



కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య అల్లం శ్రీనివాసరావు నియమితులయ్యారు. నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేస్తున్న ఆయనను వైవీయూ ఇన్‌చార్జి వీసీగా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఆర్డర్ ద్వారా ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు వైవీయూ ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ఫణితి ప్రకాష్ బాబు పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నియమితులు కావడంతో ఆయనను రిలీవ్ చేశారు. ఆ స్థానంలో నూతన ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్‌గా ఆచార్య అల్లం శ్రీనివాసరావును నియమించారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన వీసీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

25న రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు

రాజంపేట : రాజంపేట బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించనున్నారు. సోమవారం నామినేషన్ల ప్రక్రియ సీఈఓ పి.సురేష్‌కుమార్ నేతృత్వంలో ప్రారంభమైంది. బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి హనుమంతు నాయుడు నామినేషన్‌ను దాఖలు చేశారు. మంగళవారం కూడా నామినేషన్ల ప్రక్రియ జరుగుతుంది. 19న నామినేషన్ల స్క్రూటిని, 20న నామినేషన్ల ఉపసంహరణ, 21న పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా, 25న పోలింగ్, అదే రోజున కౌంటింగ్ నిర్వహించనున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరంలోని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం ఢిల్లీశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన తెలుపుతూ మంగళవారం సాయంత్రం 5గంటల నుండి 6గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రయాణీకులు తమ సమస్యలను, సూచనలు, సలహాలను 99592 25774 అనే ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి కానీ, వాట్సాప్ ద్వారా కానీ తెలియజేయాలన్నారు.

పరిష్కారం.. పరిహాసం

- భూమి చుట్టూ సమస్యలు
- పరిష్కారం కాని సమస్యలు
- గ్రీవెన్స్‌సెల్‌కు మళ్లీమళ్లీ వస్తున్న అర్జీదారులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ , ఇతర ఉన్నతాధికారులు

కడప సెవెన్‌రోడ్స్/కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయం, మండల తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం అపరిష్కృతంగానే మిగులుతోంది. అధికారుల నిర్లక్ష్యంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఫలితంగా గ్రీవెన్స్‌కు అర్జీదారులు మళ్లీ మళ్లీ వస్తున్నారు. మొత్తం వస్తున్న అర్జీలను పరిశీలిస్తే 90 శాతం భూమికి సంబంధించినవే ఉన్నాయి. రీ సర్వే సందర్భంగా ఉత్పన్నమైన సమస్యలను పరిష్కరించాలంటూ కుప్పతెప్పలుగా అర్జీలు వస్తున్నాయి. రెవెన్యూ, సర్వే విభాగాల తర్వాత పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, గృహ నిర్మాణం, పాఠశాల విద్య తదితర శాఖలకు సంబంధించిన అర్జీలు అధికంగా వస్తున్నాయి.

పరిష్కరించకుండానే...

ఇప్పటివరకు కలెక్టరేట్, మండల తహసీల్దార్ కార్యాలయాలకు 36,180 ఫిర్యాదులు రాగా, అందులో 31,673 ఫిర్యాదులు పరిష్కరించినట్లు, 4507 పెండింగ్‌లో ఉన్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చిన 285 అర్జీలు కూడా ఇందులో ఉన్నాయి. ఎవరైనా చూస్తే అబ్బో...ఇన్ని సమస్యలు పరిష్కరించారా? అనుకుంటారు. ఇదంతా అధికారుల మాయాజాలం మాత్రమే. రెడ్రెస్సల్ జరిగాయంటున్న సమస్యల్లో చాలా భాగం వాస్తవంగా పరిష్కారం కావడం లేదు. ఎండార్స్‌మెంట్ ఇచ్చి సమస్య పరిష్కరించామంటున్నారు. ఉదాహరణకు ఒక వ్యక్తి తన భూమికి సర్వే నిర్వహించి హద్దులు చూపించాలని కలెక్టరేట్ గ్రీవెన్స్‌సెల్‌లో అర్జీ సమర్పించారనుకుందాం. సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించినపుడే ఆ వ్యక్తి సమస్య పరిష్కారవుతుంది. కానీ వాస్తవంగా జరుగుతున్నది వేరు. కలెక్టర్ నుంచి సంబంధిత మండల తహసీల్దార్‌కు అర్జీ పరిష్కరించాలని ఆదేశాలు వెళతాయి. ఆ తహసీల్దార్ ఆ బాధ్యతను మండల సర్వే అధికారికి అప్పగించి సమస్య పరిష్కారమైందంటూ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. క్షేత్ర స్థాయిలో ఇలా జరుగుతుండడంతో వచ్చిన వాళ్లే మళ్లీమళ్లీ కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది.

'వృద్ధురాలినన్న కనికరమూ లేదు..'



చేతిలో అర్జీ పట్టుకుని కుంటుకుంటూ కలెక్టరేట్‌కు వచ్చిన ఈమె పేరు బి. చంద్రమ్మ. వయసు ఏడు పదులు పైనే. ఏమైందవ్వా అని పలకరిస్తే.. 'గూడు' గురించి గోడు వెల్లబోసుకుంది. ఈమెకు వల్లూరు మండలంలోని ఎస్. ఓబాయపల్లెలోని లే అవుట్‌లో ఇల్లు మంజూరైంది. తన వృద్ధాప్య పెన్షన్ డబ్బుతో పాటు అల్లుడిచ్చిన కొంచెం డబ్బులతో ఇంటిని నిర్మించుకుంది. తనకు రావాల్సిన చివరివిడత డబ్బుల కోసం అధికారులనడిగితే 'నాలుగు ట్రిప్పుల ఇసుక, రెండు కిటికీలు మొత్తం రూ. 10,776లు విలువ చేసే సామగ్రి తీసుకున్నావుగా.. ఇదిగో ఆన్‌లైన్‌లో కూడా చూపిస్తోంది చూడు' అని జవాబిచ్చారు. నోరెళ్లబెట్టడం ఆమె వంతైంది. తన సంతకం లేకుండానే కమలాపురం గోడౌన్ నుంచి తెచ్చుకున్నట్లు చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తోంది. అసలు ఆ గోడౌన్ ఎక్కడుందో కూడా తెలియదని వాపోయింది. వృద్ధురాలినన్న కనికరమూ లేకుండా పోయింది. ఇది వరకు ఓ సారి స్పందనలో ఫిర్యాదు చేస్తే.. తనకు తెలియకుండానే విచారణ చేసి ముగించారట. నాకు రావాల్సిన డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి సారూ అని వేడుకుంది.

శ్మశాన భూమి ఆక్రమణలు తొలగించాలి



బ్రహ్మంగారిమఠం మండలం కందిమల్లాయపల్లె గ్రామ సర్వే నెంబరు 464లో ప్రభుత్వం 1976లో 10.05 ఎకరాల భూమిని శ్మశాన వాటిక కోసం కేటాయించింది. అందులో ఎనిమిది ఎకరాలు పైబడి భూమిని కొంత మంది దురాక్రమించారు. దురాక్రమణల నుంచి శ్మశాన భూమిని విడిపించాలంటూ 2017లో లోకాయుక్త కలెక్టర్‌కు ఆదేశాలు పంపింది. కానీ, రెవెన్యూశాఖ ఏడేళ్లుగా ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. - బాలనాయుడు, కందిమల్లాయపల్లె, బి.మఠం

నా భూమి ఇతరులకు ఆన్‌లైన్ చేశారు



నాగిరెడ్డిపల్లె గ్రామ పొలం సర్వే నెంబరులో వెంకట రామయ్య, వెంకట సుబ్బారెడ్డి అనే అన్నదమ్ముల నుంచి 2004లో భూమి కొనుగోలు చేశాను. ఇందులో 0.66 సెంట్ల భూమిని వెంకట రామయ్య పేరిట 2018లో వీఆర్వో సుమిత్ర ఆన్‌లైన్ చేసి పాసుపుస్తకాలు కూడా జారీ చేశారు. ఈ విషయమై మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను. - ఆదినారాయణరెడ్డి, నాగిరెడ్డిపల్లె, సీకే దిన్నె

నకిలీ డాక్యుమెంట్లతో అక్రమ రిజిస్ట్రేషన్



కడప రామరాజుపల్లె 48వ డివిజన్‌లోని గూడూరు గ్రామ పొలం సర్వే నెంబరు 133 ఎ, 134, 141, 143, 144లలోని సుమారు 40 మంది ఇళ్ల స్థలాలను మచ్చా మురళి అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్లతో హక్కుదారులకు కాకుండా ఇతరులకు రిజిస్ట్రేషన్లు చేయించారు. స్థలాల నిజమైన లబ్ధిదారుల వద్ద ఉన్న డాక్యుమెంట్లు పరిశీలించి ఇప్పటికైనా రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాలి.

- కె.మునెయ్య, రామరాజుపల్లె, కడప

వనిపెంట పాత రోడ్డునే విస్తరించాలి

మైదుకూరు నుంచి వనిపెంట మీదుగా పోరుమామిళ్ల వరకు రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారు. మధ్యలో వచ్చే గ్రామాల్లో పాత రహదారులను విస్తరిస్తున్నారు. కానీ, మా వనిపెంటకు వచ్చేసరికి గ్రామంలోని పాత రోడ్డును విస్తరించకుండా ఊరి వెలుపల నుంచి రహదారులు నిర్మిస్తున్నారు. ఇందువల్ల తమ శ్మశాన వాటిక పూర్తిగా కనుమరుగవుతోంది. మా గ్రామంలో ఉన్న పాత రోడ్డునే విస్తరిస్తే మాకు ప్రయోజనకరంగా ఉంటుంది. - వీరన్న, వనిపెంట, మైదుకూరు

రహదారి సౌకర్యం కల్పించాలి

మాది తెలుగుగంగ పునరావాస గ్రామం. మా గ్రామంలోకి రావాలంటే కందిమల్లాయపల్లె, సోమిరెడ్డిపల్లె గ్రామ పొలాల సర్వే నెంబరు 309, 310 నుంచి రావాలి. ఇరుకు రహదారి వల్ల రాకపోకలు చాలా ఇబ్బందిగా ఉంది. రోడ్డు నిర్మాణంతోపాటు దాని వెంట విద్యుత్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలి. - ఆదినారాయణరెడ్డి, బి.మఠం

ఇంటి స్థలం మంజూరు చేయాలి

నేను కడప నగరం ఎర్రముక్కపల్లెలో ఉంటున్నాను. భర్త మృతి చెందడంతో ఒంటరిగా ఉంటున్నాను. నాకు ఏ ఆధారం లేదు. ఇంటి స్థలం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు ఇంటి స్థలాన్ని మంజూరు చేసేలా చూడాలని వేడుకుంటున్నా!

- ఉప్పుల వెంకట సుబ్బమ్మ, ఎర్రముక్కపల్లె, కడప

నాకు న్యాయం చేయండి

నాకు 2.20 ఎకరాల పొలం ఉంది. నా కుమారుడు నా పాసు పుస్తకాలను తీసుకొని మమ్మల్ని కొట్టి హింసించి పాసు పుస్తకాలు తీసుకెళ్లాడు. వృద్ధాప్యంలో మాకు ఆదరించే వారు కరువై ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు డాక్యుమెంట్లను పరిశీలించి న్యాయం చేయాలని పలుమార్లు వేడుకున్నా ఫలితం లేదు. - బండి సుబ్బారెడ్డి, జ్యోతి గ్రామం, సిద్దవటం

రుణం కోసం..

నేను ఎరికల కులానికి చెందిన వాడిని. చేపల వ్యాపారం చేసుకునేందుకు రుణం కోసం వచ్చాను. ఇప్పటికి 8-10 సార్లు స్పందనకు వచ్చినా నాకు అధికారులు రుణం మంజూరు చేయలేదు. కూలీ పనికూడా చేయలేక నడవలేని స్థితిలో ఉన్నాను. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. న్యాయం చేయాలని కోరుతున్నాను.

- నరసింహులు, చింతరాజుపల్లె ఎరికలపాలెం, ఒంటిమిట్ట

లింగ వివక్ష చూపే వారిపై కేసులు నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

కడప రూరల్/కడప కోటిరెడ్డి సర్కిల్: ఆడ పిల్లల శాతాన్ని పెంచేందుకు కృషి చేయడంతో పాటు లింగ వివక్షతను చూపే వారిపై కేసులు నమోదు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి పి. జాన్‌ఇర్విన్ అన్నారు. సోమవారం స్థానిక డివిజనల్ అధికారి కార్యాలయంలో థామస్ మన్రో మీటింగ్ హాల్‌లో రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నిర్మూలనపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల లింగ నిష్పత్తిని గమనిస్తే బాలురతో పోలిస్తే బాలికల శాతం తక్కువగా ఉందన్నారు. అసమానతలు తొలగించి సమాజంలో ఆడపిల్లల శాతం పెంచాలని తెలిపారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలకు చట్టపరమైన శిక్ష ఉంటుదన్నారు. లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. నోడల్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ మాట్లాడుతూ ఆర్ఎంపీలు అబార్షన్‌లు చేయకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రబ్బాని, సీఐ బి. రామకృష్ణ, డాక్టర్ బాలకృష్ణ, టి.మోహన్ కృష్ణ, భారతి, అధికారులు, ఎన్జీఓలు పాల్గొన్నారు.

ప్రారంభమైన 'పది' పరీక్షలు

- తొలి రోజు 27,800 మందికిగాను 27,648 మంది హాజరు
- జిల్లాలో పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన అబ్జర్వర్, డీఈఓ



పరీక్షలకు హాజరైన విద్యార్థులు



కుమార్తెకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న తండ్రి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు తమ తల్లితండ్రులతో కలిసి పరీక్షా కేంద్రాలకు వచ్చారు. తొలిరోజు పరీక్ష కావడంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు ధైర్యం చెబుతూ కనిపించారు. మరికొందరు 'ఆల్ ది బెస్ట్' చెబుతూ కేంద్రాల్లోకి పంపారు. ఇంకొందరు దగ్గరుండి హాల్‌టికెట్టు నెంబర్లను చూడడంలో సాయపడ్డారు. దీంతో పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. అధికారులు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. జిల్లావ్యాప్తంగా 161 పరీక్షా కేంద్రాలలో 27,800 మంది విద్యార్థులకుగాను 27,648 మంది హాజరుకాగా 152 మంది గైర్హాజరయ్యారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా అబ్జర్వర్..

పదో తరగతి పరీక్షల జిల్లా అబ్జర్వర్ మధుసూధన్ రావు జిల్లాలోని ఒంటిమిట్ట మండలం ఒంటిమిట్ట జెడ్పీ హైస్కూల్‌ను, మాధవరం జెడ్పీ హైస్కూల్‌ను, కొండమాచుపల్లి జెడ్పీ హైస్కూల్స్‌ను తనిఖీ చేసి చీఫ్ సూపరెండెంటింట్లకు, డిపార్టుమెంట్ ఆఫీసర్లకు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు.

ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా చర్యలు

జిల్లావిద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ కడపలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్, పవన్ స్కూల్, వికాస్ స్కూల్, గంగాభవాని హైస్కూల్, సాయిబాబా హైస్కూల్స్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

బాబు పాలనలో అందరికీ ఇబ్బంద్‌లే!

- 'డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ'సిబ్బంది విధుల బహిష్కరణ
- ఇబ్బందులు పడిన రోగులు
- 'ఆరోగ్య శ్రీ'పథకం చరిత్రలో విధులను బహిష్కరించడం ఇదే ప్రథమం



ఇతని పేరు బాబా సాహెబ్. వయసు 35 ఏళ్లు. కడప నగరం ఆజాద్‌నగర్‌కు చెందిన ఇతను వారం రోజుల క్రితం అనారోగ్యం పరిస్థితుల్లో 108లో రిమ్స్‌లో చేరాడు. మొదట ఆయాసం, జలుబు, దగ్గుతో చేరాడు. చేరిన సమయంలో వైద్యసేవల అనంతరం వివిధ వైద్య పరీక్షలను చేసిన దాక్టర్లు ఇతనికి ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరడం వల్ల తిరుపతి స్విమ్స్‌కు రెఫర్ చేశారు. ఈ రెఫర్‌కు సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు కడప రిమ్స్ ఐపీ విభాగంలో 'ఎన్టీఆర్ వైద్య సేవ' సిబ్బందిలో ఇద్దరు మాత్రమే విధుల్లో ఉన్నారు. దాదాపు గంటకు పైగా సమయం పట్టడంతో అల్లాడిపోయాడు.



కడప కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వైద్య మిత్రలు

కడప రూరల్ : 'డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ'(ఆరోగ్య శ్రీ)లో పనిచేస్తున్న సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం విధుల బహిష్కరించి..నిరసన తెలిపారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 108 నెట్ వర్క్ ఆసుపత్రులకు వచ్చిన పేదలు ఉచిత వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వ్యాధులతో నెట్ వర్క్ ఆసుపత్రులకు వచ్చే పేదలు అక్కడ ఉన్న 'ఆరోగ్య మిత్ర' హెల్ప్ డెస్క్‌ను సంప్రదిస్తే రోగుల రిజిస్ట్రేషన్‌తో పాటు అన్ని అంశాలు వారే పర్యవేక్షిస్తారు. ఆరోగ్య మిత్రలు విధులను బహిష్కరించడంతో ప్రభుత్వం ఆరోగ్య మిత్రల రోల్‌ను ఆసుపత్రులకే అప్పగించింది. వారు చాలా ఆసుపత్రుల్లో అత్యవసరమైన అంటే ఇన్ పేషెంట్స్‌కు మాత్రమే వైద్య సేవలు అందించారు. కొన్ని చోట్ల అది కూడా జరగలేదని సమాచారం. మిగతా వారిని ఆసుపత్రి సిబ్బంది నేడు బంద్..రేపు రండి అని చెప్పి పంపించారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాధిగ్రస్తులు తమ బాధను ఎవరికీ చెప్పుకోలేక ఆవేదనతో వెనుతిరిగి వెళ్లారు. కొంతమంది వెనుతిరిగి వెళ్లలేక..అనారోగ్యం బాధను తట్టుకోలేక వైద్యుడికి ఫీజును చెల్లించి వైద్య చికిత్సను పొందారు. మొత్తం మీద వైద్య సేవ సిబ్బంది ఒక్కరోజు విధులను బహిష్కరించినందుకే దాదాపు 3,255 రకాలకు చెందిన వైద్య సేవలకు ఆటంకం ఏర్పడింది. 2007-2008లో నాటి సీఎం వైఎస్సార్ ఆరోగ్య శ్రీని ప్రవేశపెట్టారు. నాటి నుంచి ఇప్పటి వరకూ ఏ రోజు వైద్య సేవలు నిలిచిపోలేదు. ఎప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చినా ఆరోగ్య శ్రీ ఆటుపోట్లను ఎదుర్కొంటుంది. ఇప్పుడు ఏకంగా వైద్య సేవలే నిలిచిపోవడం గమనార్హం.



పుష్పగిరి ఐ హాస్పిటల్‌లో ఎన్టీఆర్ వైద్య మిత్ర కౌంటర్ వద్ద ఎదురుచూస్తున్న రోగులు



రోగిని తిరుపతికి రెఫర్ చేసేందుకు 108లో ఎదురు చూస్తున్న రోగి, బంధువులు

క్షణక్షణం.. నరకం!

వైద్యం బంద్ అని చెప్పారు...



నా బిడ్డ చెవి నొప్పి సమస్యతో బాధపడుతోంది. డాక్టర్‌కు చూపించడానికి కడపకు వచ్చాను. ఇక్కడ ఆరోగ్య శ్రీ కింద చూడడం లేదు. అందరూ బంద్‌లో ఉన్నారు. రేపు రమ్మని చెప్పారు. నా బిడ్డ చెవి నొప్పితో బాధపడుతుంటే ఎలా ఉండాలి. డాక్టర్‌కు ఫీజు కట్టి నా బిడ్డకు చూపించాలనుకుంటున్నాను. - రఫీక్, ఖాజీపేట

నాలుగు రోజుల నుంచి తిరుగుతున్నా పేరు నమోదు కాలేదు



నాలుగు రోజుల నుంచి కడపకు కంటి ఆపరేషన్‌కు సంబంధించి పుష్పగిరి ఐ హాస్పిటల్‌కు నా కుమారుడితో పాటు వస్తున్నా. కానీ ఇక్కడ 'ఎన్టీఆర్ వైద్య సేవ'కు సంబంధించిన పేరు నమోదు చేయలేదు. ప్రతి రోజూ బస్సు ఛార్జీలు, సమయం వృథా అవుతోంది. ఈ రోజైనా నా పేరు నమోదు అవుతుందో లేదో.

- ఖాజా రసూల్, చాగలమర్రి, నంద్యాల జిల్లా

ఉదయం నుంచి...



ఎడమకన్నుకు ఆపరేషన్ చేసుకోవాలని గతంలో డాక్టర్లు చెప్పారు. పోరుమామిళ్లనుంచి తెల్లవారుజామునే బయలుదేరి పుష్పగిరి కంటి ఆసుపత్రికి ఉదయాన్నే చేరుకున్నాను. ప్రాథమిక వైద్య పరీక్షల తరువాత ఎన్టీఆర్ వైద్య సేవలకు సంబంధించి పేరు నమోదు చేసేందుకు వచ్చి ఎదురు చూస్తున్నాను. మధ్యాహ్నం 1 గంట అవుతున్నా నమోదు కాలేదు.- రమీజా,పోరుమామిళ్ల

వైద్యం లేదని చెప్పారు...



కాలుకు సంబంధించిన సమస్యతో కడపకు వచ్చాను. తీరా ఇక్కడికి వస్తే ఈ రోజు బంద్ ఉంది.. ఎవ్వరూ చూడరు రేపు రండని చెప్పారు. పేదలకు వైద్య సేవలు బంద్ చేస్తే మా లాంటి వారి పరిస్థితి ఏమి కావాలి..?- చిట్టిబాబు, మైదుకూరు

'ఎన్టీఆర్ వైద్య సేవ' సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

కడప రూరల్ : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలో పనిచేస్తున్న వైద్య మిత్రలు సమస్యల పరిష్కారానికి సోమవారం విధులను బహిష్కరించారు. అలాగే కలెక్టరేట్ ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు విజయ్ మాట్లాడుతూ ఫీల్డ్ లెవల్ సిబ్బందికి మినిమమ్ స్కేల్, కేడర్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం కలగలేదని తెలిపారు. తప్పని పరిస్థితుల్లో ఒక రోజు విధుల బహిష్కరణ..శాంతియుత నిరసన తెలిపామని పేర్కొన్నారు. ఫీల్డ్ సిబ్బందిని ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పరిగణించడంతో పాటు డీపీఓ కేడర్, అమలు చేసి కనీస వేతనం ఇవ్వాలన్నారు. అంతర్గత ప్రమోషన్లు కల్పించాలని పేర్కొన్నారు. ఆ యూనియన్ ఉపాధ్యక్షురాలు కవిత, జేసీ సుబ్బరాయుడు, నాగార్జునరెడ్డి, జనార్ధన్‌రెడ్డి పెద్ద సంఖ్యలో వైద్య మిత్రలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం


వసంత (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరం ఫరీదానగర్‌కు చెందిన ఇంటర్ చదువుతున్న బాలిక అదృశ్యమైనట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు ఫరీదానగర్‌కు చెందిన గొడుగునూరు వసంత (17) వన్ టౌన్ సర్కిల్ సమీపంలోని ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలో చదువుతోంది. ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైందని తెలిపారు. బంధువులు ఆమె కోసం వెతికినా ఆచూకీ దొరక్క పోవడంతో బాలిక తండ్రి శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

జ్యోతి క్షేత్రంలో ఆశ్రమాలు తిరిగి నిర్మించాలి

కడప సెవెన్‌రోడ్స్ : జ్యోతి క్షేత్రంలో ఇటీవల ప్రభుత్వం కూల్చివేసిన ఆశ్రమాలను తిరిగి నిర్మించాలని డిమాండ్ చేస్తూ అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వాలిటీ సంయుక్తాధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర్‌స్వామి, హెచ్‌పీఈ జాతీయప్రధాన కార్యదర్శి కొవ్వూరు లోకనాథ్ మాట్లాడుతూ కాశిరెడ్డి నాయన జ్యోతి క్షేత్రం ఎంతో ప్రసిద్ధిగాంచిందన్నారు. ఆశ్రమ వసతి గృహాలను అటవీ అధికారులు కూల్చివేసిన సంఘటన లక్షలాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కూల్చివేతలు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జై భారత జాతీయ ఉపాధ్యక్షుడు వంశీ, గురవయ్య, పలువురు భజన కళాకారులు పాల్గొన్నారు. అనంతరం జేసీకి వినతిపత్రం అందజేశారు.

రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : రాయలసీమ ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా రాయలసీమకు అన్యాయమే జరుగుతుందని, అదేం ఖర్మో తెలియదు గానీ వర్షాలు అసలే పడవన్నారు. ఆయన పదిహేనేళ్ల అధికారంలో ఉంటే 14 ఏళ్లు కరువేనని, ఒక ఏడాది వరదలు వచ్చాయన్నారు. ఈ పదిహేనేళ్లలో రైతులు తమ పంటలు నష్టపోవడం మినహా బాగుపడింది లేదన్నారు. ఈసారి కూడా అదే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. 2014–19లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ ప్రభుత్వం కల్వకుర్తి, రంగారెడ్డి పాలమూరు ఎత్తిపోతల పథకం, దిండి ఎత్తిపోతల పథకాల పేర్లతో అక్రమ నీటి ప్రాజెక్టులు చేపట్టిందన్నారు. వీటికి నీటి కేటాయింపులు లేకపోయినా ఇది అక్రమమని ఆనాడు ఉన్న టీడీపీ ప్రభుత్వం ప్రశ్నించలేదన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట ఎత్తు 885 అడుగులని, దానిపైన నీళ్లుంటే తప్పా రాయలసీమకు నీళ్లు రావన్నారు. 800 అడుగులుంటే విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. ఫలితంగా అవసరమున్నా.. లేకపోయినా తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీరు కిందికిపోయేలా చేస్తున్నారన్నారు. కనిష్ట పరిమితి నిల్వ చేయకపోవడం వల్ల రాయలసీమ ప్రాజెక్టులకు నీరు రావడం లేదన్నారు. రాయలసీమ ప్రయోజనాలను చంద్రబాబు ఆనాడు తాకట్టు పెట్టడం వల్ల నేడు సాగునీరు కాదుకదా తాగునీటికి కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కర్ణాటక, మహారాష్ట్రల్లో వరదలు వస్తే తప్పా శ్రీశైలం నిండటం లేదన్నారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచుతున్నా చంద్రబాబు నోరు మెదప లేదన్నారు. సీమలోని తెలుగుగంగ, ఎస్‌ఆర్‌బీసీ, జీఎన్‌ఎస్‌ఎస్, చెన్నైకి తాగునీరు అందించాలంటే సుమారు 101 టీఎంసీలు కావాల్సి ఉందన్నారు. అందుకే దివంగత వైఎస్సార్ ఎక్కువ నీటిని తీసుకుపోయేలా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11వేల క్యూసెక్కులకు పెంచారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ సామర్థ్యాన్ని 33వేల క్యూసెక్కులకు పెంచారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉండగా వైఎస్సార్ జలయజ్ఞంలో చేపట్టిన ఏ ప్రాజెక్టులను కూడా పూర్తి చేయలేదన్నారు. అందుకే ఆయన రాయలసీమ ద్రోహిగా మిగిలిపోయారన్నారు. రాయలసీమ రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023లో రాయలసీమ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారని, దీనిపై తెలంగాణలోని టీడీపీ వారితో ఎన్‌జీటీకి ఫిర్యాదు చేయించారన్నారు. శ్రీశైలం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్, నాగార్జున సాగర్‌ను తెలంగాణ ప్రభుత్వం నిర్వహణ చేయాల్సి ఉన్నా తెలంగాణ లెక్కచేయడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసం పార్టీలకతీతంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బీహెచ్ ఇలియాస్, శ్రీరంజన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని హార్సిలీ హిల్స్ క్రాస్ సమీపం రామాపురం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు. స్థానిక బీసీ కాలనీకీ చెందిన జయచంద్ర(58), సువర్ణ (50) భార్యాభర్తలు. జయ చంద్ర చిత్తూరు ఆర్టీసీ డిపోలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. వీరు బైక్ పై మదనపల్లెకు వెళ్లి తిరిగి బి.కొత్తకోటకు వస్తున్నారు. హార్సిలీ హిల్స్ క్రాస్ దాటుకుని రామాపురం వద్దకు రాగానే పీటీఎం నుంచి మదనపల్లికి టమాటా లోడుతో వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జయచంద్ర కాలికి పలుచోట్ల ఫ్రాక్చర్లు అయ్యాయి, సువర్ణకు తల, పలుచోట్ల గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జయచంద్రను బెంగళూరుకు, సువర్ణను వేలూరు ఆస్పత్రులకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

● బీమా లేని బతుకులు



వారు నిరాశ్రయులు.. కన్నవారిని.. కన్న ఊరును వదిలేసి వచ్చిన వలస జీవులు. పగలంతా ఏదో ఒక పని చేసుకుని.. రాత్రయ్యే సరికి ఇదిగో ఇలా ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తుంటారు. అయిన వారికి.. ఆత్మీయులకు దూరంగా ఉంటున్న వీరి బతుకులకు ఎలాంటి ధీమా లేదు.. వీరు సేద తీరుతున్న చోట గోడపైన ఉన్న జీవిత బీమా ప్రకటన చూసిన వారు ఏ బీమా వర్తించని బతుకులు వీరివే కదా అంటూ ఓ క్షణం ఆగి.. ఆలోచించి వెళ్లిపోతున్నారు. కడప నగరంలో ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో సాక్షి కంట పడిన దృశ్యమిది.

– ఎస్‌కే మొహమ్మద్ రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప.

విద్యుత్ తీగలు తెగి అరటి పంట దగ్ధం


విద్యుత్ తీగలు తెగిపడి కాలిపోయిన అరటి మొక్కలు

లింగాల : మండలంలోని బోనాల గ్రామంలో విద్యుత్ తీగలు తెగి మంటలు చెలరేగి అరటి పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన రమేష్‌రెడ్డి అనే రైతు తన పొలంలోని చీనీ చెట్లను నరికివేసి పొలం గట్టు పైన వేశాడు. సోమవారం ఉదయం విద్యుత్ తీగలు తెగి ఎండిన చీనీచెట్లపై పడటంతో మంటలు చెలరేగాయి. ఆ మంటల వేడికి సుమారు ఎకరా పొలంలో ఉన్న మూడు నెలల అరటి మొక్కలు కాలిపోయి సుమారు రూ.50వేలు నష్టపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. చీనీ పంటలో దిగుబడి రాక వాటిని తొలగించి అరటి పంట సాగు చేస్తే ఇలా కాలిపోవడం బాధాకరంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు తనకు న్యాయం చేయాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశారు.

హాస్టల్ విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నరేంద్ర, సుబ్బరాయుడు

కడప ఎడ్యుకేషన్ : జమ్మలమడుగు పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల కళాశాల వసతి గృహంలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నరేంద్ర, సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. కడపలోని వారి కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో అనేక సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈ సంఘటనలపై విచారణ చేపట్టి విద్యార్థులకు అవగాహన కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఆరు నెలల క్రితం ఇదే హాస్టల్‌లో ఇద్దరు అమ్మాయిలు ఆత్మహత్యకు యత్నించారన్నారు. అప్పుడే విచారణ జరిపి చర్యలు తీసుకుని ఉంటే ఈ రోజు ఈ సంఘటన జరిగి ఉండేది కాదన్నారు. స్థానికంగా నివాసం ఉండాల్సిన ఏఎస్‌డబ్ల్యూఓ గురుప్రసాద్ తన 35 ఏళ్ల సర్వీసులో ఏ ప్రాంతంలో పనిచేసినా పులివెందులలో నివాసం ఉండి విధులకు సక్రమంగా హాజరు అయ్యేవారు కాదనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నరసింహ, గోపి, అయ్యన్న, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

పోలీస్ క్రికెట్ స్టేడియంలో అత్యాధునిక పిచ్ రోలర్


నూతన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రోడ్డు రోలర్‌ను ప్రారంభించి నడుపుతున్న జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్

కడప అర్బన్ : జిల్లా పోలీస్ కార్యాలయం సమీపంలోని పోలీస్ క్రికెట్ స్టేడియంలో అత్యాధునిక పిచ్ రోలర్‌ను జిల్లా ఎస్పీ ఈ.జీ. అశోక్ కుమార్ సోమవారం ప్రారంభించారు. రోలర్‌కు జిల్లా ఎస్పీ పూజ నిర్వహించి స్వయంగా డ్రైవ్ చేసి పరిశీలించారు. వర్షానికి గ్రౌండ్ తడవకుండా ఉంచేందుకు వీలుగా ఏర్పాటు చేసిన వాటర్ ప్రూఫ్ గ్రౌండ్ షీట్‌ను కూడా పరిశీలించారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బంది క్రీడల ద్వారా నూతనోత్తేజం పొందవచ్చని, స్టేడియంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ ఇతరులు కూడా స్టేడియంను అద్దె ప్రాతిపదికన ఉపయోగించుకోవచ్చన్నారు. వివరాలకు 9121100641 లేదా 9000144343 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏ.ఆర్) బి.రమణయ్య , ఆర్.ఐ లు టైటస్, ఆనంద్, వీరేష్, శ్రీశైల రెడ్డి, శివరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలి

జిల్లా ఎస్పీ ఈ.జి.అశోక్ కుమార్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్


కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్.పి ఈ.జి. అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్)లో ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడారు. వారి సమస్యలను విని, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమాకాంత్ పాల్గొన్నారు.


బుగ్గవంక కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


కడప అర్బన్ : కడప నగరం తారకరామా నగర్ సమీపంలోని బుగ్గ వంక కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న తాలూకా ఎస్ఐ తాహిర్ హుస్సేన్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్ఐ వివరాల మేరకు.. మృతి చెందిన వ్యక్తి వయస్సు 55 నుంచి 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. కాలువలో పడి రెండు రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 9121100 514. 9121100516. ల్యాండ్ లైన్ నెంబర్ 08562- 242132 కు ఫోన్ చేసి మరింత సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

తల్లి శవంతో ఇంట్లోనే..

- ఇద్దరు కుమారుల్లో ఒకరు ఆత్మహత్య
- ఇల్లు వదిలివెళ్లిన మరొకరికి ఆశ్రయం ఇచ్చిన ఆశ్రమం


ఆశ్రమానికి తీసుకు వెళ్లకముందు జనార్దన్


ఆశ్రమంలో జనార్దన్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం


ఆశ్రమ నిర్వాహకులు రామకృష్ణతో జనార్దన్

కడప కల్చరల్ : కడప నగరం శాటిలైట్‌సిటీ వద్దగల ఇంట్లో నెల రోజుల క్రితం ఓ వృద్ధురాలు మరణించింది. ఆమెకు పెళ్లికాని 45–55 సంవత్సరాల వయస్సుగల ఇద్దరు కుమారులు మినహా ఇంకెవరూ లేరు. ఆమెకు వచ్చే పెన్షన్‌తోపాటు అక్కడ, ఇక్కడ చిన్న చితకా పనులు చేసి వారిని పోషించేది. నెల కిందట ఆమె మరణించింది. ఈ విషయం బయట ఎవరికీ తెలియదు. ఇద్దరు కుమారులు ఎవరితో మాట్లాడేవారు కాదు. తల్లి మరణించినా కూడా శవంతోపాటు అక్కడే ఉండిపోయారు. ఒక కుమారుడు మూడు రోజుల తర్వాత ఉరి వేసుకుని మరణించాడు. దుర్వాసన రావడంతో ఆ ప్రాంతీయులు పోలీసుల ద్వారా ఇంటిని పరిశీలించగా విషయం తెలిసింది. మున్సిపల్ సిబ్బంది ద్వారా మృతదేహాలను ఖననం చేయించారు. మిగిలిన పెద్ద కుమారుడు జనార్దన్ ఇల్లు వదిలి బయటే తిరుగుతూ ఉండిపోయాడు. ఈ నేపథ్యంలో స్థానికుల్లో ఒకరు పోరుమామిళ్లలోగల శ్రీ వివేకానంద ఆశ్రమ నిర్వాహకులు పాపిజెన్ని రామకృష్ణకు సమాచారం ఇచ్చారు. ఆయన తన బృందంతో వచ్చి కడప నగరం చెన్నూరు బస్టాండులో ఉండిన జనార్దన్‌ను వెతికి పట్టుకుని తన ఆశ్రమానికి తరలించారు. మొదట ఆశ్రమానికి వచ్చేందుకు అంగీకరించలేదు. మొత్తానికి ఆయనను ఒప్పించి ప్రత్యేక వాహనంలో ఆశ్రమానికి తీసుకెళ్లారు. మానసిక వైద్యం చేయించి శుభ్రంగా తీర్చిదిద్దారు. జనార్దన్ ప్రస్తుతం వ్యక్తులను గుర్తు పెట్టి మాట్లాడే స్థితికి వచ్చాడు. ఈ అవకాశం తనకు లభించడం సంతోషంగా ఉందని ఆశ్రమ నిర్వాహకులు రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

రేపు విజయవాడలో మహా ధర్నా

పులివెందుల టౌన్ : మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన విజయవాడలోని ధర్నా చౌక్‌లో మహా ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాంద్ బాషా తెలిపారు. సోమవారం పులివెందుల పట్టణంలో ఆయన మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథక కార్మికులకు నెలకు రూ.10వేలు వేతనం ఇవ్వాలని, ఎలాంటి కారణాలు లేకుండా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కామాక్షమ్మ పాల్గొన్నారు.

ఆర్టీపీపీ కాలుష్యంపై రైతుల ఫిర్యాదు

ముద్దనూరు : మండలంలోని కొసినేపల్లె గ్రామంలోని సుమారు 30 మంది రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం కడప కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్‌కు హాజరైన రైతులు ఆర్టీపీపీలోని చిమ్నీలనుంచి వెలువడే బూడిద కాలుష్యం అధికంగా ఉందన్నారు. దీంతో పరిశ్రమకు పక్కనే ఉన్న తమ గ్రామంలోని పంటలు నాశనమవుతున్నాయని వాపోయారు. గతంలో పలుమార్లు ఆర్టీపీపీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఈ కాలుష్యాన్ని అరికట్టి తమను కాపాడాలని వారు కోరారు.

ట్యాంకరు బోల్తా

ముద్దనూరు : స్థానిక ఎత్తులేటికట్ట మలుపులో సోమవారం భారీ ట్యాంకరు బోల్తా పడింది. వేగం అదుపు చేసుకోలేక సిమెంటు ట్యాంకరు బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

రక్షణ కల్పించండి

కడప రూరల్ : కడప నగరంలోని ఒక ద్విచక్ర వాహన షోరూం అధినేత నుంచి తమకు ప్రాణ హాని ఉంది.. రక్షణ కల్పించాలని రాయచోటికి చెందిన అమీన్, ఆసీఫ్‌లు కోరారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాము రాయచోటిలో ఓ వాహన షోరూంలో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆ షోరూం అధినేత తమపై అవినీతి ఆరోపణలు చేసి డాక్యుమెంట్స్, చెక్కులు తీసుకున్నాడని తెలిపారు. తమకు జరిగిన అన్యాయంపై పలుమార్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా వారు ఫిర్యాదు తీసుకోలేదన్నారు. తిరిగి తమపై అక్రమంగా కేసులు పెడుతున్నారన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

1.50 కేజీల గంజాయి స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ తెలిపారు. సోమవారం స్థానిక అర్బన్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని చెన్నంపల్లె ఎస్టీ కాలనీ సమీపంలో గల కాశినాయన గుడి వద్ద అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం రావడంతో తనతో పాటు ఎస్ఐలు, సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించామన్నారు. పట్టణంలోని రాజుగారివీధికి చెందిన దండు మనోజ్‌కుమార్, వల్లెరవారిపల్లె గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌లు గంజాయి విక్రయిస్తూ కనిపించారన్నారు. వెంటనే వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు. నిషేధిత గంజాయి అక్రమ రవాణాకు పాల్పడినా, అమ్మకాలు చేపట్టినా, వారికి సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో అర్బన్ ఎస్ఐలు ఎం.సత్యనారాయణ, జె.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ఐచర్ వాహనం


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డులో ఎస్వీ కల్యాణ మండపం సమీపంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి గుడి దగ్గర ఆటోను గుర్తు తెలియని ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ చంగల రామాంజనేయులుతో పాటు ఆటోలో ఉన్న మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరు పట్టణంలోని డ్రైవర్ కొట్టాల కాలనీకి చెందిన అల్లం లక్ష్మీనారాయణమ్మ, అల్లం జగన్నాథం, అల్లం నాగ పద్మ, అల్లం నాగ బిందు, జి.నాగముని, జి. రామాంజనేయులు ప్రొద్దుటూరులోని ఒకే కుటుంబానికి చెందినవారు. వీరంతా ప్రొద్దుటూరు వెళ్లేందుకు చంగల రామాంజనేయులుకు చెందిన ఆటో ఎక్కారు. ఎస్వీ కల్యాణ మండపం వద్దకు రాగానే ఆటో వెనుక వైపు గుర్తు తెలియని ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చంగల రామాంజనేయులు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, ఆటోలో ఉన్న మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

లింగాల సబ్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

లింగాల : మండల కేంద్రంలోని 133 కేవీ సబ్ స్టేషన్‌లో సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సబ్ స్టేషన్ సిబ్బంది ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సబ్ స్టేషన్ ఆవరణలో భారీగా ముళ్ల పొదలు ఉండటంతో ఫైర్ స్టేషన్ సిబ్బంది మంటల తీవ్రత ట్రాన్స్‌ఫార్మర్లకు తగలకుండా జాగ్రత్తలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది అనిల్ కుమార్, రవీంద్రారెడ్డి, డ్రైవర్ ఆపరేటర్ బుజ్జిబాబు పాల్గొన్నారు. 133 కేవీ సబ్ స్టేషన్‌కు ఎలాంటి ప్రమాదం లేదని ఏఈ రమేష్ తెలిపారు. ముందు జాగ్రత్తగా విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు.